# ప్రేమో మీటర్

**- పుష్పాంజలి**

భళ్ళున తెల్లవారింది.

సరిగ్గా మేలుకోని శేషశాయి చెవు లింకా బాహ్య ప్రపంచంలోని శబ్దాలను గ్రహించే స్థితిని చేరుకోలేదు.

అయినా బయట మైకులో అడ్వర్టయిజ్‌మెంట్ అతని చెవుల్లోకి బలవంతంగా దూరింది.

"ఆనందో బ్రహ్మ గోవిందో ప్యార్!" అన్న పాట.

అది ఆగి బుస్సున శబ్దం.

ఆ తరువాత మానవ కంఠం.

"అయ్యలారా! అమ్మలారా! భార్యలారా, భర్తలారా! రండి. మంచి తరుణం మించిన దొరకదు. నేడే అరుదెంచండి. ప్రేమోమీటరు పార్లరుకు. మీ దాంపత్యంలో అనురాగం ఎంత ఉందో తెలుసుకోండి. మీ జీవితాలను సుఖమయం చేసుకోండి! మంచి తరుణం మించిన దొరకదు. కపిలతీర్థం రోడ్‌లో గల ప్రేమోమీటరు పార్లరుకు విచ్చేయండి! అయ్యలారా!" ఇలా సాగుతోనే ఉంది.

ఉలిక్కిపడి లేచాడు శేషశాయి.

పద్మ అలికి డెక్కడా వినబడటం లేదు.

ఇంతకుముందు పొద్దున్నే కాఫీ ఇచ్చేది.

ఈమధ్య ఆమెను ప్రేమోమీటర్ పార్లర్‌కు తీసుకువెళ్ళలేదని నిరసనగా అతనికి కాఫీ ఇవ్వడం లేదు.

తన దుస్థితికి తానే జాలిపడుతూ కిచెన్ చేరిన శేషశాయికి అక్కడి దృశ్యం చూడగానే ఒళ్ళు మండింది.

పద్మ కిటికీ చువ్వలు పట్టుకొని ప్రేమోమీటరు వాడి మాటలు అర్ధనిమీలిత నేత్రాలతో తన్మయురాలై ఆలకిస్తోంది.

శాయి కాఫీ చేసుకున్నాడు కోపంగా.

అప్పటికి పద్మ వెనక్కి తిరిగింది.

ఆలాగా ఆ బండి మ రెందరి మనశ్శాంతి పాడు చేయడానికో, ఎన్నో సంసారాల్లో చిచ్చు పెట్టడానికో ముందుకు సాగింది.

"వినడం అయిందా?" అన్నాడు ఉక్రోషంగా.

"ఊ..." అని మూతి మూడు వంకరలు తిప్పింది.

"ఇవాళ నేను కాంప్‌కు వెళ్ళాలి. అదయినా గుర్తుందా?"

పద్మ ఆ మాట వినగానే మందస్మిత సుందర వదనారవిందయ్యింది.

శేషశాయికి ఎందుకో భయం వేసి గుండె గబగబా కొట్టుకుంది.

పద్మ చిరునవ్వు లొలికిస్తూ అతణ్ణి సమీపించి - "ఏమండీ! కనీసం ఈసారైనా కాంప్ నుంచి రాగానే ఆ పార్లర్‌కు పోదామండీ!" అంది.

అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోవడం కన్నా ఒక్కసారి "ఊ" అంటే పోతుందిగా అనుకున్నాడు.

అతను మాట్లాడకపోవడంతో పద్మ అతని రెండు భుజాలపై చేతులు వేసి మరింత గోముగా - "ఏఁ... వం... డీ" అంది.

దాంతో శేషశాయి "ఊఁ" అన్నాడు ఉక్రోషంగా.

పద్మకు అతడిపై ప్రేమ తన్నుకొచ్చి చప్పున ఓ ముద్దు పెట్టేసింది.

బస్సులో వెళ్తూ ఆలోచిస్తున్నాడు శాయి.

ఈమధ్య త నెన్ని కష్టాలు పడ్డాడో సినిమా రీలులా గుర్తుకు రాసాగింది.

అస లిదంతా ఎలా మొదలైంది?

ఆ దరిద్రపుగొట్టు ప్రేమోమీటరు వల్లే కదా!

పెళ్ళయి ఇంకా ఓ సంవత్సరం పూర్తి కాకముందే పద్మ పక్కనుండీ త నెన్ని రాత్రులు ఒంటరితనం అనుభవించాడు!

అమెరికాలో ప్రేమను కొలిచే ఓ సాధనం కనిపెట్టారనీ, జ్వరాన్ని థర్మామీటర్‌తో కొలిచినట్టే, ప్రేమను కొలిచే మీటరనీ పేపర్లలో చదివి "ఔరా!" అనుకున్నాడు.

అనతికాలంలోనే అది ఢిల్లీ, బొంబాయి ల్లాంటి పెద్ద నగరాల్లోకి రావడం చూసి, తన మాతృభూమి సాధించిన ప్రగతికి మురిసిపోయాడు.

చివరికి హైదరాబాద్‌లో కూడా దాని ప్రవేశం జరిగిందని చదివి, తెలుగులో తెగ ఆనందపడిపోయాడు.

ఎవ్వరూ ఊహించని విధంగా ఒక తల మాసిన వెధవ [శేషశాయి దృష్టిలో] తిరుపతిలో ప్రమోమీటరు సెంటరు తెరిచాడు.

శ్రీనివాసుని దర్శనార్థం తిరుపతి వచ్చే భక్తకోటి ప్రేమోమీటరు పార్లరుకు వెళ్ళడం కూడా ఆనవాయితీగా మారింది.

తిరుమల గుడి కన్నా ప్రేమోమీటరు పార్లర్ ముందు రష్ ఎక్కువైంది.

పడిగాపులు గాచే ఆ జనం ఫోటోలు పేపర్లలో వేశారు.

ఆ సన్నివేశాలపై టీ.వీ.ల్లో స్పెషల్ బులెటిన్లు ప్రసార మయ్యాయి.

భార్యా భర్తలు, ప్రేమికులు మొదలైన వర్గాలకు చెందిన స్త్రీ, పురుషులు తమ భాగస్వామికి తమపై ఎంత ప్రేమ ఉందో తెలుసుకోవాలని కుతూహలపడసాగారు.

కాని, ప్రేమోమీటర్ పార్లర్‌కు వెళ్ళి వచ్చిన దంపతుల్లో అధిక శాతం విడాకులకు దరఖాస్తులు పెట్టుకున్నారు. దేశంలో చాలామంది లాయర్లకు ఊపిరి తిరగనంత పని! అలా చేయలేని వారు తమ భర్త లేక భార్యకు తమపై ప్రేమ లేనందుకు లోలోపలే చింతిస్తూ బ్రతుకులు వెళ్ళదీస్తున్నారు.

ఆ విధంగా ప్రేమోమీటర్ పని ఉన్నవాళ్ళకూ, లేని వాళ్ళకూ కూడా చర్చనీయాంశమైంది.


అది తనకూ, పద్మకూ మధ్య తుఫాను సృష్టిస్తుందని తను ఊహించనైనా లేదు.

పద్మ దాన్ని గురించి ఆ నోటా ఈ నోటా వింటూనే ఉంది.

ఓ రోజు - "ఏమండీ! చూశారా! పిల్లి క్రిములు కూడా ప్రేమోమీటరు పార్లర్‌కు వెళ్తున్నార్టండీ!" అంది. ఆమెకు ఇంగ్లీష్ రాదు.

"ఛీ! ఛీ! పిల్లి క్రిము లేమిటీ? నీ ముఖం! 'పిల్‌గ్రిమ్స్' అంటే యాత్రికులు" అన్నాడు శాయి.

"ఏదోలెండి. ఊర్లో పెట్టుకుని మనం ఆ పార్లర్‌కు ఇంతవరకూ వెళ్ళలేదు" అంది విచారంగా.





శేషశాయి గుండె గతుక్కుమంది.

నిజానికి పద్మకు అలాంటి ఆలోచన రావడం వెనుక ఇరుగింటి పొరుగింటి తల్లుల హస్తం ఉంది.

"మనమూ ఓసారి పోదామండీ !" అంది పద్మ.

"నీ కేమైనా మతి పోయిందా? అది పని లేనివాళ్ళు చేసే పని. నాకు నీమీద నమ్మకం ఉంది" అన్నాడు ధీమాగా శాయి.

"అది కాదండీ. నాపైన నమ్మకం సరే. మీరు మాట మాటకి కాంపులంటూ వెళ్తారు. అందుకని..." అంది నానుస్తూ. శాయి నిశ్చేష్టు డయ్యాడు.

ఆ విధంగా మరల మరలా మారాం చేసే పద్మకు - "నామీద నీకు నమ్మకం లేదా పద్మా. నా జీవితమంతా ఏకపత్నీవ్రతుణ్ణి" అని బుజ్జగించాడు. లాలించాడు.

"నాకు తెలుసండీ. అయినా..."

"చెపితే వినవు. అసలు అవన్నీ అబద్ధాలు."

"ఊఁ. మీ రన్నీ అలాగే చెప్తారు. మరి ఆ రెడ్డిగారూ, ఆయన భార్య ఎందు కెళ్ళారు? ఆ డాక్టరూ, డాక్టరమ్మా ఎందు కెళ్ళారు?" అంది.

ప్రతి రోజూ ఆఫీసు నుంచి రాగానే ఎవ రెవరు ఆవేళ ఆ పార్లర్‌కు వెళ్ళిందీ లిస్టు చదివేది. అది శాయికి భరింపశక్యం అయ్యేది కాదు.

రాను రాను అతని బ్రతుకు దుర్భరంగా తయారైంది.

పప్పులో ఉప్పుండదు.

అన్నం ఉడకదు.

పచ్చళ్ళలో, కూరల్లో గొడ్డుకారం.

అలా వంటింటి సంబంధమైన ఇబ్బందులన్నీ

రుచి చూపింది. అన్నీ భరించాడు మూర్తీభవించిన సహనమూర్తిలా. చివరికి ఆమెకు ప్రతి రాత్రీ ప్రేమోమీటరు జ్వరం రాసాగడంతో అతని ప్రేమ జీవనం కడగండ్లపాలైంది.

ఓనాడు భోంచేస్తున్న భర్తని చేయి పట్టుకుని వరండాలోకి లాక్కెళ్ళింది.

"అలా చూడండి!" అంటూ ఎదురింటివేపు చూపించింది.

అక్కడ - ఎదురింటి పురోహిత్ భార్య త్రిపుర తా నేదో గొప్ప ఘనకార్యం చేసే వీరవనితలా నడుంకట్టి ముందు బయటికొచ్చింది.

ఆమె వెనక పురోహిత్ వధ్యశిలకు నడిచే బలిపశువులా వచ్చాడు.

"అయితే ఇప్పు డేమిటట?" అన్నాడు శాయి.

"ఏముంది? వాళ్ళూ వెళ్తున్నారు. ఈ రోజే కాదు. ఇప్పటికి మూడు రోజుల్నించీ వరసగా. పాపం! పురోహిత్‌గారు ఆడవాళ్ళ కాలేజీలో లెక్చరరుటండీ!" అంది.

"బుద్ధి లేక ఆ త్రిపుర తీసుకువెళ్తే మాత్రం ఆ చవట, శుంఠ, హెన్ పెక్కెడ్ పిగ్, వాడెలా వెళ్తున్నాడో! అనుకున్నాడు.

"పద్మ అరిచి గీ పెట్టినానరే, ఇప్పుడు పెడుతున్న బాధలకన్నా ఇంకా వేయి రెట్లు బాధ లనుభవించినా నరే, తను మాత్రం వెళ్ళకూడదు" అనుకున్నాడు.

ఆవేళ ఆఫీసులో టైపిస్టు రామ్మూర్తి రాలేదు.

ఆవేళ అతగాడికి కోర్టులో హియరింగ్ అనీ, భార్యకి విడాకు లిస్తున్నాడనీ ఎవరో చెప్పారు.

కారణం ప్రేమోమీటర్ ఆమెకు అతనిపై ప్రేమ లేనట్టు సూచించిందట.

అతని మనసు వికలమైంది.

ఆ విధంగా ప్రేమోమీటర్లు సంఘానికి పట్టిన చీడపురుగుల్లా అనూహ్యమైన తీవ్రతరపు పరిణామాలను తీసుకురాసాగాయి.

తరతరాలుగా ఈ సాంఘిక వ్యవస్థకు వెన్నెముక లాంటి వైవాహిక వ్యవస్థ కూకటి వేళ్ళతో పెకలింపబడే ప్రమాదం ఏర్పడ్డది.

అఖిల భారత స్థాయిలో - యాంటీ ప్రేమోమీటర్ యూనియన్ ఏర్పడ్డది.

వాళ్ళంతా ప్రేమోమీటరు పార్లర్లు మూసివేయాలని ప్రదర్శనలూ, గట్రా సలపసాగారు.

అయితే అంతర్జాతీయ ప్రేమోమీటర్ల సంఘం వారు తమ అభిప్రాయం ఈ విధంగా వెలిబుచ్చారు.

"లక్షల వ్యయంతో, అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్‌తో స్థాపించబడ్డ ఈ పార్లర్లు మూసివేయడం జరిగే పని కాదు. పైగా ఇవి భార్యా భర్తలు ఒకరి నొకరు మరింత అర్థం చేసుకోడానికే తోడ్పడతాయి.

ప్రేమోమీటర్ల భయంతో వాళ్ళు తమ మనసులను ఇంకా ఇంకా అదుపులో ఉంచుకొంటారు. తద్వారా కుటుంబ వ్యవస్థ పటిష్టమౌతుంది.

తద్వారా ప్రేమోమీటర్లు సమాజ శ్రేయస్సుకే తోడ్పడతాయి." అదీ వాళ్ళ ఉవాచ.

ఈ ప్రేమోమీటర్ల చర్చలో జరిగిన గలాటాలో పదిమంది ఎమ్.ఎల్.ఏ.లు తీవ్రంగా గాయపడి హాస్పిటల్లో చికిత్స పొందసాగారు. బి.బి.సి. లండన్‌వారు ఈ విషయమై అదేపనిగా వార్తలు ప్రసారం చేస్తున్నారు.

తమాషా ఏమిటంటే...

పెళ్ళి కాని ప్రేమికులు ఆ పార్లర్ నుంచి విజయగర్వంతో బయటకి వస్తున్నారు.

కొత్తగా పెళ్ళయిన వాళ్ళ విషయంలో కూడా మీటరు రీడింగ్ ఫరవాలేదు.

ఎటొచ్చీ పెళ్ళయి మూడు, నాలుగు సంవత్సరాలు దాటిన వాళ్ళకే ఈ మీటరు వల్ల అధిక నష్టం జరుగుతోంది.

చిట్టచివరికి అతనికి 'ఎస్' అనక తప్పలేదు.

తను కాంప్‌కు వెళ్తుండగా పద్మ - "ఏమండీ! మీరు క్యాంపు నుంచి రాగానే పార్లర్‌కు పోవాలండీ!" అంది.

"అంటే. స్టేషన్ నుంచి అటు నుంచి అటే తీసుకుపోతా వా ఏంటి?" అన్నాడు తను గొప్ప జోక్ వేసినట్టు సంబరపడిపోతూ.

"మళ్ళా టైం గడిస్తే లాభం లేదండీ! అట్లా వెళ్తేనేనండీ ప్రయోజనం" అంది పద్మ.

గతుక్కుమన్నాడు శాయి.

** ** **

వారం రోజుల తరువాత ట్రెయిన్ దిగిన శాయి క్లోక్ రూమ్‌లో పెట్టే బేడా పడేసి, ప్రేమోమీటర్ పార్లర్‌కు శరవేగంతో [ఆటోలో] పయనించాడు.

ఏది ఎలా ఉంటుందోనని తొలుత త నొక్కడే వెళ్ళి దాని ప్రాస్ అండ్ కోన్స్ పరిశీలించాక పద్మను తీసుకువెళ్ళాలని అతని ఉద్దేశం.

దార్లో అడ్వర్‌టైజింగ్ బండి - "అయ్యలారా! అమ్మలారా! రండి! మంచి తరుణం మించిన దొరకదు..." అంటూ రొద పెడ్తోంది.

దానిమీద బాంబు వేద్దామన్నంత కోపం వచ్చింది.

తన దగ్గర బాంబు లేకపోవడంతో చేసేది లేక ఆవేశం అణచుకున్నాడు.

కపిలతీర్థం రోడ్డులోని ఆ పార్లర్ ముందు ప్రజలు తండోపతండాలుగా ఉన్నారు.

నాలుగు గంటలపాటు పడిగాపులు గాచాడు. టికెట్ లభించలేదు. చివరికి బ్లాక్‌లో టికెట్ లభించింది.

అతని గుండె గుబగుబ మంటున్నాయి.

కాంప్‌లో కో-ఇంజనీరు "అలిమేలు మంగ" అందాన్ని పదే పదే మనసులో శ్లాఘించాడు.

కాని పైకి ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

## నిజానికి

**భగవాన్:** అ దేంటయ్యా! నా తల పూర్తి బట్ట కదా! నా క్రాఫ్‌కు కూడా పది రూపాయలా?

**బార్బర్:** నిజం చెప్పాలంటే మీరు పదిహేను రూపాయ లివ్వాలి. ఎందుచేతనంటే మీ తలలో వెంట్రుకలు ఎక్క డెక్కడున్నాయో వెతికి క్రాఫ్ చేయాలి.

\- డా. వేసారపు మాధవయ్య [పుత్తూరు]

దానివల్ల ఈ దిక్కుమాలిన ప్రేమోమీటరు పద్మ ముందు తన పరువు తీస్తుందేమో నన్న భయంతో ముందే పార్లరుకు కష్టపడి వచ్చా డతను.

విజయగర్వంతో పార్లర్‌లో అడుగు పెట్టాడు.

విశాలమైన ఆ హాలు భయంకరమైన ఎలక్ట్రిక్ ఎక్విప్‌మెంట్స్, వైర్లతో, బల్బులతో, కంప్యూటర్లతో నిండి ఉంది.

ఆపరేటర్ శాయిని అనుమానంగా చూసి-

"ఆవి డెక్కడ సార్..." అన్నాడు.

"ఆవిడ రాలేదు" అన్నాడు శాయి.

వెంటనే అతను సీరియస్‌గా - "టెస్ట్ చేయాలంటే ఆడా, మగా ఇద్దరూ ఒకరి కొకరు ఎదురెదురుగా ఉండాలి సార్!" అన్నాడు.

హతాశుడైన శాయి, అన్నింటికీ తెగించినవాడై ఇల్లు చేరాడు.

ఇల్లు చేరగానే "పద్మా ఓ పద్మా తొందరగా కదులు" అంటూ హడావిడి చేశాడు.

పద్మ తన జీవితంలో ఏ సందర్భంలోనూ అంత తొందరగా తయారుకాలేదు.

మధ్య మధ్యలో - "అయ్యో! పాపిష్టిదాన్ని మీకు కాఫీ అయినా ఇచ్చాను గాను" అంటూ వాపోతోంది.

శేషశాయికి ఆమెను ద్వేషించాలని అనిపించినా ప్రేమోమీటరు గుర్తుకొచ్చి భయపడ్డాడు.

ఆపరేటర్ కొన్ని వైర్లను ఇద్దరి తలలకూ, గుండెలమీదనూ కట్టి, స్టెతస్కోప్సు లాంటివి ఎడాపెడా ఫిక్స్ చేశాడు.

"జాగ్రత్తగా వినండి మేడమ్! ఆకుపచ్చ లైటు పూర్తి ప్రేమకు చిహ్నం. పసుపుపచ్చ లైటు వెలిగితే ఫరవాలేదు. కాని రెడ్ లైట్ వెలిగితే ప్రేమ లేనట్టు" అని స్విచ్ ఆన్ చేశాడు.

వెంటనే ఎర్రని కాంతితో ఆ గది ప్రకాశవంతమైంది.

పద్మ మరో మాట లేకుండా పిసపిసా నడుస్తూ నాగినిలా నిష్క్రమించింది.

శేషశాయికి కట్టిన వైర్లు విప్పుదీస్తూ ఆపరేటర్ - "సారీ సార్! కనీసం పది రోజుల ముందునుంచీ ఎవ్వరినీ తలచుకోకూడదు" అంటూ తన సంతాపం వెలిబుచ్చాడు.

"ముందు చెప్పకపోతివిగదరా దుర్మార్గుడా!" అనుకుని, రాగల ప్రచండ తుపానును తలచుకుంటూ ఇల్లు చేరాడు.

** ** **

మరునటి దినం పేపర్లో ఈ వార్త చదివి ఎగిరి గంతేశాడు శాయి.

"శుభవార్త. కనీవినీ ఎరుగని వింత.
ఒకే ఒక మాత్ర వాడినంత మాత్రాన్నే
జరుగును వింత.
ప్రేమోమీటరు పార్లర్‌కు వెళ్ళేముందు-
ఒక గ్లాసుడు నీళ్ళతో తీసుకోండి మందు.
కేవలం ఒకే ఒక మాత్ర-
ప్రేమాల్జిన్-
వెలిగించును సదా ఆకుపచ్చ బల్బును."

గబగబా బట్టలు ధరించి ప్రేమాల్జిన్ కోసం బయలుదేరాడు శేషశాయి. ★